క్లుప్తంగా

యోగా శిక్షణ నేడు

నందలూరు : శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 7 గంటలకు యోగా శిక్షణా కార్యక్రమం పురస్కరించుకుని జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయిలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా శిక్షణా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని స్థాయిల సిబ్బందితో యోగా శిక్షణా కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని తెలిపారు. యోగా కార్యక్రమానికి సౌకర్యవంతమైన దుస్తులు, యోగా మ్యాట్ వారి వెంట తీసుకొని రావాలని తెలిపారు.

కొనసాగుతున్న మహాభారత యజ్ఞం


ద్రౌపతి స్వయంవరాన్ని వివరిస్తున్న భాగవతారిణి సీతామహాలక్ష్మి

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసియున్న శ్రీ మల్లూరమ్మ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారతయజ్ఞం కార్యక్రమం వైభవంగా సాగుతోంది. ప్రముఖ భాగవతారిణి సీతామహాలక్ష్మి ద్రౌపతి స్వయంవరం, బకాసురవధ కార్యక్రమాలను మంగళవారం వివరించారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయాలి

చిట్వేలి : ఈనెల 28వ తేదీ బుధవారం ఉదయం 6 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరు కావాలని ఎంపీడీఓ మోహన్ కోరారు. కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు యోగాకు అనుకూలంగా ఉండే దుస్తులతో పాటు యోగా మ్యాట్ తీసుకొని రావాలని పేర్కొన్నారు. హాజరుకాని ఎడల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మోహన్ తెలియజేశారు.

పేదలకు అల్పాహారం వితరణ


పంపిణీకి సిద్ధం చేసిన అల్పాహారం

నందలూరు : భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ జన్మదినం సందర్భంగా రాజంపేట అసెంబ్లీ కో–కన్వీనర్ డా.అరిగె రాంప్రసాద్ ఆధ్వర్యంలో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు బస్టాండు కూడలిలోని పేదలకు అల్పాహారం వితరణ చేశారు. అంతకుముందు కుంపిణీపురంలోని వరాహ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు చుక్కా శ్రీనివాసులు, శివారెడ్డి, విఠల్‌స్వామి, హెచ్‌డీ ప్రసాద్, మండెం నాగేంద్ర, మురళి, జయకుమార్‌రెడ్డి, సుబ్బయ్య, మహేష్, రమణగౌడ్, హర్ష, అనిల్‌కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు ఘన నివాళి


వీఆర్‌ఓ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న హేమంత్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామ వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సంజీవయ్య సేవలు మరువలేనివని జిల్లా వీఆర్‌ఓ సంఘం అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మృతుడి స్వగ్రామంలో తోటి వీఆర్‌ఓలతో కలిసి సంజీవ మృతదేహానికి నివాళులు అర్పించారు. సంజీవ చేసిన సేవలను స్మరించుకున్నారు. అదే విధంగా పలువురు వీఆర్‌ఓలు సంజీవ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ పదోన్నతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు పారదర్శకంగా జరపాలని కోరారు. ఏ ఏ క్యాడర్లో ఎంత మంది ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారో, బహిర్గత పరుస్తూ డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరచి ఉపాధ్యాయ సంఘాలకు కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. అడేక్వసీని కూడా బహిర్గత పరచాలన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు రోస్టర్ కం మెరిట్ పద్ధతిలో ఇవ్వాలని అన్నారు.

పోషకాల రేడు.. నేరేడు

- ఆరోగ్య ఫల ప్రదాయినిగా గుర్తింపు
- కిలో నేరేడు రూ.200 దాక విక్రయం
- అధికంగా తింటే అనర్థమేనంటున్న వైద్యులు


విక్రయానికి సిద్ధం ఉన్న నేరేడు పండ్లు

ప్రొటీన్లు	కొవ్వు	పీచు	ఖనిజం
7%	3%	3%	4%

నేరేడు పండులో ఆరోగ్యానికి మేలు చేసేవి ఇవే..	
కాల్షియం	15 మిల్లీ గ్రాములు
ఐరన్	12 మిల్లీ గ్రాములు
విటమిన్-సీ	18 మిల్లీ గ్రాములు
పాస్పరస్	18 మిల్లీ గ్రాములు
పిండి పదార్థం	14 శాతం

రాజంపేట టౌన్ : ప్రకృతి ప్రసాదించే పండ్ల జాతులలో ఒకటి నేరేడు పండు. ఆరోగ్య ఫల ప్రదాయినిగా పిలిచే నేరేడు పండును సక్రమంగా వినియోగిస్తే ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు శరీరంలో ఏర్పడే కొన్ని అనారోగ్య సమస్యలను కూడా దూరం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. నేరేడు పండు రుచిలో కూడా మేటిగా ఉంటుంది. నేరేడు పండుతో పాటు ఆకులు, చెట్టుబెరడు కూడా ఆరోగ్యానికి మేలు చేసేవే. నేరేడు పండ్లను కోయడం కొంత కష్టంతో కూడుకున్న పని అందువల్ల ధర కూడా అధికంగానే ఉంటుంది. రైతు నుంచి దళారులు కిలో 80 రూపాయిలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. దళారులు వ్యాపారులకు 130 రూపాయిలకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు వినియోగదారులకు రెండు వందల రూపాయిలకు విక్రయిస్తున్నారు. ఎవరైనా బేరం ఆడితే వ్యాపారులు 180 రూపాయిలకు కూడా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నేరేడు పండ్లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. నేరేడు పండ్లను ఇక్కడి వ్యాపారులు మదనపల్లె నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు. సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానపరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుతం నేరేడు పండ్ల సీజన్ ఆరంభమైనందున రోజుకు ఒకటి చొప్పున తిన్నా ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు

- నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, పొటాషియంతో పాటు ఏ, సి విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సీజనల్ వ్యాధుల బారీ నుంచి రక్షణ కలుగుతుంది
- మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం అదుపులో ఉంటుంది. అలాగే కిడ్నీలను శుభ్రపరుస్తుంది.
- మూత్రాశయంలో ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయం పనితీరు మెరుగుపరచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- నేరేడు పండ్లలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి.
- దంతాలు, చిగుళ్ల ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోటిలో చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది.
- కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది.
- నేరేడు పండులో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారిస్తాయి. ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

నియంత్రణ లేకుంటే ఆరోగ్య సమస్యలు

- నేరేడు పండు తినడంలో నియంత్రణ లేకుంటే దుష్ఫలితాలు సంభవించవచ్చు
- వగరుగా ఉండి నాణ్యతలేని నేరేడు పండ్లు తింటే గొంతునొప్పి బారీనపడే ప్రమాదముంది.
- సీజన్ మారే సమయంలో నేరేడు పండ్లను మితంగా తినాలి
- ఉబ్బసం ఉన్న వారు ఈ పండ్లను ఎక్కువగా తినకూడదు. దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశముంది
- నేరేడు పండ్లలో ఉండే అత్యధిక లవణాలు, పోషకాల వల్ల బలహీనమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారికి తరచూ కడుపునొప్పి వచ్చే అవకాశముంటుంది.

ముగిసిన చిన్నక్క, పెద్దక్క అమ్మవార్ల జాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని మడితాడు గ్రామంలో వెలసిన చిన్నక్క, పెద్దక్క అమ్మవార్ల జాతర మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవార్ల మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, మొక్కులు తీర్చుకొని ముడుపులు చెల్లించారు. చాందినీబండ్లు, చెక్కభజనలు, కోలాటాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అసాంఘిక ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు కల్పించారు.

నరసింహులు మరణం వైఎస్సార్ సీపీకి తీరనిలోటు


నరసింహులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : మండలంలోని కొల్లావారిపల్లె అరుంధతివాడకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కత్తి నరసింహులు (35) అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆయన సోదరుడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి మంగళవారం కొల్లావారిపల్లె అరుంధతివాడకు చేరుకొని నరసింహులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నరసింహులు తొలి నుంచి వైఎస్సార్ సీపీకి నిబద్ధత గల కార్యకర్త అన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో లేని సమయంలో, ప్రస్తుతం పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ అనేక ఇబ్బందులు ఎదురవుతున్నా, ఆ ఇబ్బందులన్నింటిని ధైర్యంగా ఎదుర్కొంటూ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలు ఎప్పటికి మరువలేనివని తెలిపారు. నరసింహులు మృతి పార్టీకి తీరనిలోటని ఆకేపాటి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి తాను ఎప్పుడు అండగా ఉంటానని హామీనిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు వెంకటరామయ్యనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, బుర్రు సురేంద్ర, దండు గోపి, దాసరి పెంచలయ్య, గొంటు మణి, బొజ్జ పెంచలయ్య, మలిశెట్టి శ్రీనివాసులు గౌడ్, హరి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్లై తదితరులు

కలకడ : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పశుసంవర్ధకశాఖ సహాయకుడి కుటుంబానికి ఆశాఖ నుంచి రూ.1,29,200 ఆర్థిక సహాయం అందజేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. మండలంలోని కె.బాటవారిపల్లె సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కలకడ మండలం నడిమిచెర్ల పంచాయతీకి చెందిన షేక్ ఖాదర్‌బాషా మృతి చెందాడు. అతడు బాలయ్యగారిపల్లె పంచాయతీ సచివాలయంలో వెటరినిటి అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉండే వారు. మృతిచెందిన విషయం తెసుకున్న అధికారులు మదనపల్లె డివిజన్ నుంచి రూ.51,500, రాయచోటి డివిజన్ నుంచి రూ.77,700 లను మంగళవారం నడిమిచెర్లలోని మృతుని ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు అంజేశారు. కార్యక్రమంలో రాయచోటి డివిజన్ ఉపసంచాలకులు విజయ్‌కుమార్, కలకడ సహాయ సంచాలకులు క్రిష్ణయ్య, వైద్యాధికారులు డాక్టర్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపు.. ఉబుకుతున్న మంచినీరు


పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పైపులైన్ పగిలి ఉబుకుతున్న నీరు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపల్ పరిధిలో తరచూ నీటి సరఫరా పైపులు పగిలిపోతూ మంచినీరు రోడ్డు పాలవుతుంది. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపం కారణంగా ప్రజలకు అందాల్సిన నీరు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై ఏరులై పారుతుంది. మంగళవారం రాత్రి రాయచోటి పట్టణం మదనపల్లి మార్గంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో నీటి సరఫరా పైపులు పగిలిపోవడంతో నీరు ఉప్పొంగి ఆ ప్రాంతమంతా నీటిమయమైంది. రాయచోటి – మదనపల్లి ప్రధాన మార్గంలో కిలోమీటర్లు పైగా ఈ నీటి ప్రవాహం సాగింది. తరచూ మున్సిపల్ పరిధిలో నీటి సరఫరా పైపులైన్ పగిలి రోడ్లపై మంచినీరు పరుగులు పెడుతోంది. వారానికి ఒకసారి అందుతున్న తాగునీరు గత కొన్ని నెలలుగా 15 రోజులకు ఒకసారి అందుతోందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు సిబ్బంది పర్యవేక్షణ కొరవడంతో పగిలిన పైపుల కారణంగా నీటిసరఫరాలో మరింత ఆలస్యం చోటు చేసుకుంటుందని ప్రజలు మదనపడుతున్నారు.

బదిలీలలో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో ఎటువంటి అవాంతరాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని దీంతోపాటు సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు, జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలకు దరఖాస్తు చేసిన స్కూల్ అసిస్టెంట్లు, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు సాంకేతిక పరంగా పాయింట్లు విషయంలో ఇబ్బందులు ఉంటే వెంటనే సవరించి తగిన న్యాయం చేయాలని కోరారు.

దీనిపై డీఈఓ మాట్లాడుతూ బదిలీలకు దరఖాస్తు చేసిన స్కూల్ అసిస్టెంట్లకు ఏవైనా తప్పులు దొర్లి ఉంటే తగిన ఆధారాలతో ఈనెల 28వ తేదీ గ్రీవెన్స్‌లో నమోదు చేయాలని, తగిన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జారి చెన్నకేశవులు, రెడ్డిబాబు ఉన్నారు.

విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు విజయవంతం

మదనపల్లె సిటీ : రాష్ట్ర విద్య, వైజ్ఞానిక తరగతులు విజయవంతమైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ తెలిపారు. స్థానిక అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కాలేజీలో 17వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించినట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు పలు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరైనట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఇంటర్మీడియట్, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు సకాలంలో విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రామలక్ష్మమ్మ

చిన్నమండెం : 14 నుంచి 18 వయస్సు ఉన్న కిశోర బాలికలు బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రామలక్ష్మమ్మ, మల్లూరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పవనకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చాకిబండ పంచాయతీ ఏబీ వాండ్లపల్లె అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ పవనకుమారి ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్‌లో భాగంగా కిశోర బాలికల వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు రక్షణ పోక్సో చట్టం అనే అంశంపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు.

రోగులకు పండ్లు పంపిణీ


ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

వీరబల్లి : మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల వ్యవసాయ అనుబంధ విభాగాల అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రోగులకు పంచిపెట్టారు. ఆయన అభిమానులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఎంపీపీకి పుట్టిన శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన

పీలేరు : స్థానిక వారపు సంతలో కళాజాత ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, కోర్‌స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేసీ నటరాజ్ కళాబృందం కళాజాతతో అవగాహన కల్పించారు. సుఖవ్యాధులు, చికిత్స గురించి వివరించారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను తక్కువ చేసి చూడకూడదని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహానాడు కాదు.. డ్రామానాడు


మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి టౌన్ : టీడీపీ నిర్వహిస్తున్నది మహానాడు కాదని.. అదొక డ్రామానాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ ఆరోపించారు. మంగళవారం జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్ పనులు మొదలుకొని కరెంట్ ఒప్పందాల వరకు అన్ని తన అనుచరులకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దోచిపెట్టే కార్యక్రమానికి తెరలేపారన్నారు. పీక్ అవర్స్‌లో కరెంట్ సప్లై పేరిట యూనిట్‌కు రూ.2.11లు అదనంగా రాష్ట్ర ప్రజలపై భారం మోపారని చెప్పారు. అమరావతి నిర్మాణంలో వందల కోట్లు ముడుపుల కోసం మళ్లీమళ్లీ నిర్మాణలు చేస్తూ కొంత తరహా లూటీకి అధ్యుడయ్యాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ నిధులు లేవ్, అమ్మఒడికి అసలే లేవు అన్నదాతకు కనీసం లేదు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లేనేలేదు కానీ చంద్రబాబు నాయుడు రాజభోగం అనుభవించడానికి మాత్రం నిధులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జానం రవీంద్ర యాదవ్, రేపన సంజీవయ్యలు పాల్గొన్నారు.

కిశోరీ వికాసం భవితకు సోపానం


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి

గాలివీడు : కిశోరీ వికాసం భవితకు సోపానమని లక్కిరెడ్డిపల్లి సీడీపీఓ వై.పద్మావతి అన్నారు.మంగళవారం మండలంలోని పందికుంట–1 గ్రామ పంచాయతీ పరిధిలో కిశోరీ వికాసం వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్షన్ 8 సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో కిశోరీ బాలికల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే కిశోరీ వికాసం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వై.అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు ఇరగమ్మ, దిల్షాన్, సావిత్రి, కిశోర బాలికలు, ప్రజలు పాల్గొన్నారు.

రుణాలను రెన్యువల్ చేసుకోండి


కె.వెంకట్రావు, ఏపీజీబీ మేనేజర్

గాలివీడు : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి, తిరిగి కొత్త రుణాలు పొందాలని బ్యాంకు మేనేజర్ కె.వెంకట్రావ్ తెలిపారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ తమ శాఖ పరిధిలో దాదాపు రూ.150 కోట్ల రుణాలు లావాదేవీలు జరుగుతున్నాయని, అందులో రూ.115 కోట్లు రైతు రుణాలు, డ్వాక్రా రుణాలను అందించామని తెలిపారు. ఖాతాదారులకు విరివిగా బంగారు రుణాలు కూడా తక్కువ వడ్డీతో అందిస్తున్నామన్నారు. తమ శాఖ పరిధిలో ఖాతాదారులు రూ.30 కోట్ల మేర డిపాజిట్లు చెయ్యడం జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాంకుల కంటే ఏపీజీబీ 7.6 వడ్డీ రేటు అందిస్తోందన్నారు. ఖాతాదారులు ఈ విషయాన్ని గ్రహించి తమ బ్యాంకులో డిపాజిట్లు చేసుకోవాలని సూచించారు. జూలై మాసంలో అర్హులైన రైతులందకీ కొత్త క్రాప్ లోన్లు మంజూరు చెయ్యడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో రుణాలు ఇవ్వడంతోపాటు వసూళ్ల పరంగా తమ శాఖ ముందంజలో ఉందన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్


నిమ్మకాయల బండ ప్రాంతంలో అటవీ అధికారుల కూంబింగ్

సిద్దవటం : సిద్దవటం అటవీశాఖ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో రెండు రోజులుగా తమ సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహిస్తున్నామని రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు గొల్లపల్లె, రోళ్లబోడు, సిద్దవటం, కొండురూ బీటు పరిధిల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో రెండు రోజులగా ఎర్రచందన స్మగ్లర్ల కోసం కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అటవీ సంపద తరలిపోకుండా అణువణువు గాలిస్తున్నామన్నారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న కొన్ని గ్రామాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని రేంజర్ కళావతి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు అధికారులు మధు, పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ప్రొటక్షన్ వాచర్‌లు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం


పెనగలూరు: యోగాంధ్రలో పాల్గొన్న వివిధ శాఖల సిబ్బంది

పెనగలూరు : యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చని మండల స్థాయి అధికారులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ యోగా వలన మానవుని ఆరోగ్యానికి కలిగే లాభాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం


రాజంపేట టౌన్: యోగాసనాలు వేస్తున్న ఎంపీడీఓ వరప్రసాద్ తదితరులు

రాజంపేట టౌన్ : యోగాతో కొన్ని దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు దరిచేరవని ఎంపీడీఓ పగడాల వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన యోగా శిక్షణా కార్యక్రమంలో మంగళవారం ఎంపీడీఓ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మనిషి అనంతమైన మేథాశక్తి, ఆత్మశక్తి కలయికే యోగా అన్నారు. యోగా అన్నది వ్యాయామ పద్ధతి కాదని, మనిషి తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే సంపూర్ణ సాధన ప్రక్రియ కూడా అని చెప్పారు. యోగా మనసును, శరీరాన్ని, ఆత్మను సమతుల్యంగా ఉంచుతుందని అందువల్ల మనిషి జీవన శైలిని కూడా మెరుగు పరుస్తుందన్నారు. ఆరోగ్యమే మనిషికి నిజమైన సంపదని తెలిపారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు నిత్యం కనీసం ఒక గంట సేపు అయినా యోగా చేయాలని తెలిపారు.

మైనర్ల తల్లిదండ్రులకు ఎస్ఐ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు : అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వుల మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి నందలూరు పట్టణంలో వాహనాలను తనిఖీ చేసి, వాహనాలు నడుపుతున్న మైనర్ పిల్లల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మంగళవారం రాత్రి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. సరైన ధృవపత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ప్రమాదాల నివారణ కోసం తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి రమాబాయి అంబేడ్కర్

పీలేరురూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ ఆదర్శమూర్తి అని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణికుమార్, సీపీఐ నాయకులు టి.ఎల్. వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో రమాబాయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రమాబాయి, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, బాలగంగాధర్, రవిచంద్రలు పాల్గొన్నారు.